## క్లుప్తంగా

### కొత్త చెరువుపై ఎవరికీ హక్కు కల్పించొద్దు



కలెక్టరేట్ ఎదుట ఆలూరు మహిళలు

**జగిత్యాలటౌన్:** రాయికల్ మండలం ఆలూరులోని కొత్త చెరువుపై ఏ ఒక్క కుల సంఘానికీ హక్కులు కల్పించొద్దని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కొత్త చెరువుపై హక్కులు కల్పించేందుకుగానీ, సొసైటీ చేసేందుకుగానీ ఏ ఒక్క కులసంఘానికి అనుకూలంగా గ్రామ సభ నిర్వహించలేదని, తీర్మానం కూడా లేదని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు, పద్మశాలి, గోనేకాపు కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు కోటా కేటాయించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

**కథలాపూర్:** రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా కేటాయించాలని ఎంపీడీవో శంకర్‌కు మంగళవారం దివ్యాంగులు వినతిపత్రం ఇచ్చారు. వివిధ కేటగిరిల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, రాజీవ్ యువ వికాసంలోను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా నాయకులు లంక దాసరి శ్రీనివాస్, దేవదాస్, గుగ్లొత్ రవినాయక్, ఓం ప్రకాశ్, అస్గర్‌ఖాన్, బోరె రవి పాల్గొన్నారు.

### హుస్సేన్‌నగర్‌లో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

**మల్లాపూర్:** మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ సయ్యద్ హైదర్, గ్రామస్తులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని ముత్యంపేట అనుబంధంగా ఉన్న హుస్సేన్‌నగర్ కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటై ఏడేళ్లు గడిచినా ఇప్పటి వరకు రేషన్ షాప్‌ను ఏర్పాటు చేయలేదని, దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### బ్యాంకింగ్ సేవలపై అవగాహన

**బుగ్గారం:** ప్రతీ ఒక్కరు జీవితబీమాను చేసుకోవడం వలన అనేక ప్రయోజనాలున్నాయని, అన్ని బ్యాంకుల్లో అతి తక్కువ ప్రీమియంకే ప్రమాదబీమా పథకాలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఆర్థిక అక్ష్యరాస్యత కేంద్రం(సీఎఫ్ఎల్) కౌన్సిలర్ బూరగడ్డ కృష్ణ అన్నారు. మండలంలోని గోపులాపూర్‌లో ఆర్థిక అక్ష్యరాస్యతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలు, ఆన్‌లైన్ మోసాలు,సైబర్ మోసాల గురించి వివరించారు. వికలాంగులు, వృద్ధులు బ్యాంకింగ్ సేవలను ఇంటివద్ద నుంచి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రాజ్‌కుమార్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### కిక్కిరిసిన కొండగట్టు



**మల్యాల:** కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. బేతాళ స్వామి, శ్రీసీతారామాలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు చంద్రశేఖర్, అశోక్, హరిహరనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# వరి కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- అవగాహన లేక కాలుస్తున్న రైతులు
- క్రిమీ కీటకాలు నాశనం
- మొదళ్లను కలియదున్నితే లాభదాయకం



మల్లాపూర్‌లో వరికొయ్యలను కాల్చివేస్తున్న రైతులు

**మల్లాపూర్:** యాసంగి సీజన్‌లో వరి కోతలు ముగిసి ధాన్యం అమ్మకాలు దాదాపుగా పూర్తయ్యాయి. మరో వైపు రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ సీజన్‌లో కోసిన వరి కొయ్యలకు రైతులు నిప్పంటిస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో పంటకు ఉపయోగమయ్యే క్రిమికీటకాలు చనిపోతాయని, పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వరి మొదళ్లను కాల్చడం ద్వారా కలిగే నష్టాలు వివరించారు.

**వరి కొయ్యలకు నిప్పు పెడితే కలిగే నష్టాలు**

- వరి మొదళ్లను కాల్చడం వల్ల మంటలు ఎగబడి వేడి తీవ్రతకు సూక్ష్మజీవులు చనిపోతాయి.
- ఆశించిన మేర వరి పంట దిగుబడి రాదు
- వరి మొదళ్లలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మజీవులు ఉంటాయి. మొదళ్లను కాల్చడం వల్ల ఈ పోషకాలు నేలలో కలవకుండా మాడిపోతాయి.
- తరచుగా గడ్డి కాల్చే పొలాల్లో నేల కోతకు గురవుతుంది. తద్వారా నేలపైన ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోతుంది.
- పొలంపై గడ్డి తగలపెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతుంది. గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి వాతావరణం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం లేకపోలేదు.
- గడ్డి తిని బతికే కీటకాలు పశువులకు ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది.

**వరి మొదళ్లను కలియదున్నడం వల్ల కలిగే లాభాలు**

- భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- నేలకు సేంద్రియ పదార్థం అందుతుంది.
- యూరియా, డీఏపీ, పొటాష్ వేయడం వల్ల ఎంత ప్రయోజనం చేకూరుతుందో నేలకు అంత సేంద్రియ పదార్థం అందుతుంది.
- నేలకు కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంటే గుణం పెంచుతుంది.
- వాయు కాలుష్యం జరగకుండా ఉంటుంది.
- వరి గడ్డి మొదళ్ల పశువులకు మేతగా ఉపయోగపడుతుంది.
- వరి కొయ్యలు కుళ్లడంతో పంటకు ఎరువుగా ఉపయోగపడి దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువుగా కూడా పనిచేస్తాయి.

### వరి కొయ్యలను కాల్చొద్దు



వరి కోతలు ముగిశాక కొయ్యలకు నిప్పంటించి కాల్చడం వల్ల ఆ భూమిలో పంటకు ఉపయోగమయ్యే క్రిమికీటకాలు చనిపోతాయి. ఇలా కాల్చడంతో తర్వాత పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. కొయ్యలను కాల్చకుండా అలాగే దున్నడం వల్ల సూక్ష్మపోషకాలు పెరుగుతాయి. భూసారానికి ఎంతో మేలు కలుగుతుంది.

– లావణ్య, ఏవో, మల్లాపూర్



కథలాపూర్: మండలంలోని చింతకుంట- దుంపేట రూట్‌లో చింతకుంట గ్రామ-శివారులో విద్యుత్ స్తంభాల పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అల్లుకున్నాయి. వర్షం, ఈదురుగాలులు వీచిన సమయంలో పిచ్చిమొక్కల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు అంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
దివాకర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ- కథలాపూర్, సెల్ నం: 9440811478



# వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**జగిత్యాలఅగ్రికల్చర్:** వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి రైతులు ఆదాయం పొందాలని పొలాస వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్లాగౌడ్, డాక్టర్ బి. సతీశ్ కోరారు. ధర్మపురి మండలంలోని గాదేపల్లిలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ, జీవన రసాయన ఎరువులను వాడాలని సూచించారు. నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పేరు లేని కంపెనీలను నమ్మవద్దని సూచించారు. ఈ సందర్భంగా పంటల సాగు బ్రోచర్లను పంపిణీ చేశారు.

**మెట్‌పల్లిరూరల్:** ఎరువులు, హానికరమైన రసాయనాలు మోతాదుకు మించి వినియోగించొద్దని వాటి వల్ల నష్టాలు కలిగే అవకాశాలు ఉంటాయని పరిశోధన సంచాలకులు శ్రీలత అన్నారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో రీసెర్చ్ అసోసియేట్ వేణు రెడ్డి, మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

**మేడిపల్లి:** భీమారం మండలంలోని మన్నెగూడెంలో పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. అవసరం మేరకే రసాయనాలు వినియోగించాలని నేల తల్లిఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, నాయకులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు, అధికారులు

## గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

**మెట్‌పల్లి:** గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మెట్‌పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘ పాలకవర్గ సభ్యులను పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డును ఇవ్వడంతో పాటు భద్రతకు అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. అలాగే అడిషనల్ పీపీగా నియమితులైన చెర్లపల్లి ఆనంద్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, ఏపూరి శ్రీనివాస్, జుంగుల మారుతి, ఉత్కం సాయగౌడ్ తదితరులున్నారు.



పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న చంద్రశేఖర్

## నిరుద్యోగులకు ఉపాధి రాజీవ్ యువ వికాసం

**మల్లాపూర్:** నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేరుస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. అనంతరం వేంపల్లిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడపుల పుష్పలత, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు**

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.80 కోట్లు మంజూరు నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న నర్సింగరావు

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు**

**మల్లాపూర్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. కేవలం 18 నెలల్లోనే ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. దేశంలో అన్నిరంగాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని తెలిపారు. పేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా.. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

**కోరుట్ల:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానంలో నిలవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఇంటర్, డిగ్రీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో సీతారామ్ జిందాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ కమ్ మీన్స్ ఆధారిత స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయ హుండీని దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. జాతర సందర్భంగా వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.25600, హుండీ ద్వారా రూ.3808 సమకూరింది. కార్యక్రమంలో సిబ్బంది రాజమొగిలి, అనిల్ రావు,రాజేందర్, కేశవ్, రవి, గంగాధర్, నర్సమ్మ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు

**మల్లాపూర్/సారంగాపూర్:** రాజీవ్ యువవికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. మంగళవారం మల్లాపూర్ లో నిర్వహించిన రాజీవ్ యువవికాసం సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూల్లో బ్యాంక్ అధికారులతో కలిసి ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, దరఖాస్తు దారులు పాల్గొన్నారు.

సారంగాపూర్ మండలంలో రాజీవ్ యువ వికాస్‌కు మండలంలోని 18 గ్రామాల నుంచి మొత్తం 1246 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో చౌడారపు గంగాధర్ తెలిపారు.

**ఇంటర్వ్యూలకు చివరి అవకాశం**

**రాయికల్:** రాయికల్ మండలంలో రాయికల్ యువ వికాసానికి బుధవారం చివరి అవకాశమని ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరు కాని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**జగిత్యాలరూరల్:** గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో రమాదేవి అన్నారు. మంగళవారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులు చేసుకున్న 611 మంది బీసీ కార్పొరేషన్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో రవిబాబు, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

## ముగిసిన ఇంటర్వ్యూలు

**పెగడపల్లి/ ఇబ్రహీంపట్నం:** రాజీవ్ యువ వికాస్ యువ పథకం యూనిట్ల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూలు మంగళవారం ముగిశాయి. మండలంలో ఈ పథకం కింద 2031 మంది దరఖాస్తులు చేసుకోగా ఇంటర్వ్యూకు హాజరైన వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22 నుంచి రాజీవ్ యువ వికాస్ పథకంలో రుణాలు పొందేందుకు ఈ నెల 22 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించగా మంగళవారం ముగిసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1285 రాగా ఇంటర్వ్యూలకు 1026 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

## గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

**ధర్మపురి:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అక్కెనపెల్లి సునిల్‌కుమార్ (47) మంగళవారం వేకువజామున మృతి చెందాడు. ఆయన మృతి వార్త తెలుసుకున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, పట్టణ ప్రజలు, మిత్రబృందం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంత్యక్రియల్లో వందలాది మంది పాల్గొన్నారు. సునిల్‌కుమార్‌కు భార్య, కుమారుడు సుజిత్, కూతురు సాయి ఉన్నారు.

## ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీవన్ కుమార్

**పెగడపల్లి:** ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సీగిరి జీవన్‌కుమార్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గంధ్ర అఖిల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల సుధాకర్, కోశాధికారిగా లెంకలపల్లి కల్యాణ్, సంయుక్త కార్యదర్శిగా వలీపాషా, సోషల్ మీడియా ప్రతినిధిగా చల్ల అశోక్ ఎన్నికయ్యారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**సారంగాపూర్:** యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని బీర్‌పూర్ ట్రైనీ ఎస్సై రాజు అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ఓ ప్రైవేటు సంస్థ యువకులకు, విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తోంది. శిక్షణ పొందుతున్న వారికి ఎస్సై స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తల్లితండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలతో కష్టపడి చదివించి, జీవితంలో గొప్ప స్థానంలో ఉండాలని ఆశిస్తారని పేర్కొన్నారు. దీనిని మరచి కొందరు మత్తుపదార్థాలకు బానిస కావడంతో అటు తల్లితండ్రులకు, కుటుంబానికి, సమాజానికి అందరికి నష్టం జరుగుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. గంజాయి కొన్నా, అమ్మినా, వినియోగించినా 8712656828 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.



స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందిస్తున్న ఎస్సై

## తహసీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

**మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/ మల్యాల:** మల్లాపూర్ మండల తహసీల్దార్‌గా రమేశ్ గౌడ్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బీఎస్ఎస్ వరప్రసాద్, బీర్‌పూర్ మండల తహసీల్దార్‌గా సుజాత, మల్యాల తహసీల్దార్‌గా కె.వసంతను నియమిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, మల్యాల మండల తహసీల్దార్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు సన్మానించారు.



రమేశ్ గౌడ్



వరప్రసాద్



సుజాత

## రంగపేటలో పశు వైద్యశిబిరం

**సారంగాపూర్:** ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రంగపేటలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ జనగామ సునీల్ పశుపోషణ, పశుగ్రాస పెంపకం తదితర అంశాలను రైతులకు వివరించారు. పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామడుగు రవి, ఏనుగు జోగిరెడ్డి, తాండ్ర అశోక్ రావు, వాంకుదోత్ గీతాంజలి, కాశెట్టి రాజేష్ మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

**పెగడపల్లి:** మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు వేద యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షకులు గంగారామ్, రాజమల్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 నుంచి 30 తేదీ వరకు ఉదయం 5:30 నుంచి 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఆసక్తి గలవారు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అహల్యబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**జగిత్యాలటౌన్:** రాణి అహల్యబాయి హోల్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సమరత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్ పిలుపునిచ్చారు. సామాజిక సమరత జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహారాణి అహల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది ఉత్సవ ముగింపు కార్యక్రమం పట్టణంలోని గీత విద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖన అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అంకం లక్ష్మణ్, డా అరుణ, సామాజిక సమరత వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కనికరం లచ్చన్న, కార్యదర్శి సోమిరెడ్డి భూమిరెడ్డి, ఉపాధ్యక్షుడు సింహరాజు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

**పెగడపల్లి:** రాణి అహల్యాబాయి హోల్కర్ కుల, చేతి వృత్తులను చేసుకునే విధంగా అన్ని రకాల ప్రోత్సహకాలు అందించి వారికి అండగా నలిచిన గొప్ప వ్యక్తని రాణి అహల్యాబాయి హోల్కర్ జన్మదిన వేడకల కమిటీ జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్దిపల్లి సత్యం అన్నారు. మండలంలోని బతికపల్లిలో చేనేత వస్త్రాలు తయారు చేసే విధానాన్ని బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, కొమురెల్లి, మాజీ ఎంపీటీసీ అనసూర్య, నాయకులు పాల్గొన్నారు.

## సామూహిక పారాయణం



సామూహిక పారాయణంలో మాతలు

**జగిత్యాలటౌన్:** జగిత్యాల పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లోని శ్రీనివాస అభయాంజనేయ భవానిశంకర్ దేవాలయంలో సౌందర్యలహరి మహిళల ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజన్న శర్మ, శశి శర్మ,శ్రీనివాసస్వామితో పాటు ఆలయ నిర్వాహకులు మంచాల రాంగోపాల్, మాతలు పాల్గొన్నారు.